


**ప్లాంటు మూత.. బకాయిలు రాక..**
పాతమంచిర్యాల శివారులోని శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్‌ప్లాంటు కార్మికులకు వేతన బకాయిలు రావడం లేదు. దీంతో 32 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నారు. 8లో▸



**సమస్యల్లో లైబ్రరీలు**
జిల్లాలోని లైబ్రరీలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. పోటీ పరీక్షల వేళ పాత భవనాలు, కాలం చెల్లిన పుస్తకాలతో నిరుద్యోగులు అవస్థలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.0 /24.0

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్
- ఘనంగా జయంతి వేడుకలు



చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

**మంచిర్యాలఅగ్రికల్చర్:** శాసనసభ మాజీ స్పీకర్ డి.శ్రీపాదరావు రాష్ట్రాభివృద్ధికి విశిష్ట సేవలందించి ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచారని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి మంథని ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా, వివిధ పదవుల్లో విన్నూత సంస్కరణలతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. మృధు స్వభావిగా అన్ని వర్గాలకు చేరువగా ఉంటూ రాజకీయ జీవితంలో యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. శ్రీపాదరావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ప్రజాసేవలో ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### డీసీపీగా అశోక్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



డీసీపీ అశోక్‌కుమార్

**మంచిర్యాలక్రైం:** మంచిర్యాల డీసీపీగా అశోక్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన డీసీపీ సుదీర్ రాంనాథ్ కేకన్ బదిలీపై మహబూబాబాద్ జిల్లా ఎస్పీగా వెళ్లడం, ఆయన స్థానంలో జయశంకర్ భుపాలపల్లి జిల్లా ఓఎస్డీ అశోక్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టపరిధిలో ప్రజలకు న్యాయం చే సేందుకు కృషి చేస్తానని అన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ రవాణా, గంజాయి, పేకాట, రౌడీ షీటర్స్, దోపిడీపై దృష్టి సారిస్తానని తెలిపారు.

### పల్స్ పోలియో విజయవంతం చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌ఓ

**పాతమంచిర్యాల:** జిల్లాలో ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జీసీ.సుబ్బరాయుడు అన్నారు. శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో పల్స్‌పోలియో కార్యక్రమం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణ కోసం సిబ్బందిని సన్నద్ధం చేశామని తెలిపారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 75,727మంది ఉన్నారని, ప్రతీ చిన్నారికి పోలియోచుక్కల మందు అందించే విధంగా ఏర్పాట్లు చేశామని చెప్పారు. 459 పల్స్‌పోలియో కేంద్రాలు, 25 రవాణా బృందాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మొదటిరోజు పల్స్‌పోలియో కేంద్రాల్లో, రెండు, మూడో రోజు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అనిత, మాతాశిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి నీరజ, జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి విజయపూర్ణిమ, వైద్యాధికారి శివజ్యోతి, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### విద్యుత్ ఉత్పత్తి విస్తరణ దిశగా సింగరేణి అడుగులు

**జైపూర్:** ఎస్టీపీపీ విస్తరణ దిశగా సింగరేణి సంస్థ వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే జైపూర్ మండల కేంద్రంలో 1200మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి సాధిస్తున్న సంస్థ దీన్ని విస్తరిస్తూ మరో 800మెగావాట్ల థర్మల్ పవర్‌ప్లాంటు టెండర్ల పనులు వేగవంతం చేస్తోంది. సోలార్ పవర్‌పైనా దృష్టి సారించి చకచకా భూమిపై, ఫ్లోటింగ్ నీటిపై సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే 234మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి సాధిస్తోంది. తెలంగాణ రాష్ట్రంతోపాటు పలు రాష్ట్రాల్లో సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు సంస్థ చర్యలు చేపడుతోంది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో సీఎండీ బలరాం నేతృత్వంలో జరిగిన సమీక్ష సమావేశంలో చర్చించారు. పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశమున్న ప్రాంతాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లుగా తెలిసింది.

# ఫసల్ బీమా.. ధీమా



ఖరీఫ్‌లో భారీ వర్షాలతో నీటమునిగిన పంటలో రైతులు(ఫైల్)

- పీఎంఎఫ్‌బీవైలో రాష్ట్ర ప్రభుత్వం చేరిక
- ఏటా భారీ వర్షాలతో నష్టపోతున్న రైతులకు మేలు

**మంచిర్యాలఅగ్రికల్చర్:** జిల్లాలో కొన్నేళ్లుగా రైతులకు ఉన్న ఒక్కగానొక్క అవకాశం లేకుండా పోయింది. అతివృష్టి, వరదల కారణంగా పంటలు దెబ్బతిన్నా ఆధారం లేక నష్టపోవాల్సి వచ్చింది. పంటల బీమా కల్పించకపోవడంతో పరిహారం అందక రైతులకు ఆర్థిక నష్టం ఏర్పడింది. వరదల్లో మునిగిన పంట సర్వేలకే పరిమితమైంది గానీ పరిహారం అందలేదు. ఈ ఏడాది ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై)లో రాష్ట్ర ప్రభుత్వం చేరనుండడంతో పంటలు సాగు చేస్తున్న రైతులకు బీమాతో ధీమా లభించనుంది. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణంలో మార్పుల కారణంగా పంటలకు నష్టాలు వాటిల్లినప్పుడు రైతులను ఆదుకునేందుకు బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం బీమా పథకంలో చేరనుంది. కేంద్ర ప్రభుత్వ పంటల బీమా పథకాన్ని నాలుగేళ్ల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో జిల్లాలో ప్రకృతి విపత్తుల సమయంలో నాలుగేళ్లుగా రైతులు నష్టపోతూనే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవసాయ శాఖ సమావేశం, పీఎంఎఫ్‌బీవై సీఈవో, కేంద్ర సంయుక్త కార్యదర్శి రితేష్‌చౌహాన్‌తో జరిగిన భేటీలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకంలో చేరాలని నిర్ణయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లుగా జిల్లాలో ఎడతెరిపి లేని భారీ వర్షాలతో వేల ఎకరాల్లో పంటలు నీటిపాలవుతున్నాయి. దీంతో రైతులకు నష్ట పరిహారం అందక ఆర్థికంగా చితికిపోతున్నారు. అధిక వర్షాలు పంటలను ముంచేస్తున్నాయి. రైతులు నిలువునా మునుగుతున్నా చిల్లి గవ్వ కూడా సాయం అందడం లేదు. సాగు కోసం చేసిన అప్పులు పెరిగి.. పెట్టుబడి రాక ఆత్మహత్య చేసుకున్న సంఘటనలూ ఉన్నాయి.

### రెండేళ్లుగా నష్టపోతున్నాం ..



భారీ వర్షాలతో పంటలు నీటిపాలవుతున్నాయి. వేల రూపాయల పెట్టుబడి నీటిపాలవుతుంది. నష్టపోయినా వ్యవసాయ అధికారులు రావడం సర్వే చేయడం తప్ప పరిహారం అందడం లేదు. బీమాతోనైన కొంత ఉపయోగం ఉంటుంది.

– జాపాతి నారాయణ, నెన్నెల

### పరిహారం అందడం లేదు..



పంట చేతికి వచ్చే సమయంలో ఎడతెరిపి లేని భారీ వర్షాలు దెబ్బతీస్తున్నాయి. వరదలతో నీటి మునిగి ఇసుక మేటలు వేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం రావడం లేదు. అప్పట్లో బ్యాంకు రుణాలు తీసుకునే సమయంలో బీమా ప్రీమియం తీసుకొనేది. నష్ట పరిహారం అందేది.

– బొమ్మన శ్రీనివాస్, గ్రామం: కుందారం, మం: జైపూర్

### బ్యాంకు రుణాలతో ప్రీమియం

ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినా, పంట కోత, పొలంలో ఉంచిన పంటకు తుపాన్, అకాల వర్షాలతో నష్టాలు, అగ్ని ప్రమాదం, పిడుగుపాటు, గాలి, వాన పంట వాతావరణ మార్పులతో తెగుళ్ల కేటగిరీతో జరిగే నష్టాలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పరిహారం అందనుంది. ఏటా బ్యాంకులు రుణాలు ఇచ్చే సమయంలో ఎకరాకు పంట రకాన్ని బట్టి బీమా ప్రీమియం మినహాయించుకుంటాయి. జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకుల నుంచి రుణాలు పొందని వారు నేరుగా ప్రభుత్వానికి బీమా ప్రీమియం చెల్లించవచ్చు. రైతులు చెల్లించిన ప్రీమియం సొమ్ముకు అంతే మొత్తాన్ని ప్రభుత్వం బీమా కంపెనీకి చెల్లిస్తుంది. అతి తక్కువ ప్రీమియం చెల్లించి నష్ట పరిహారం పొందేలా రైతులకు భరోసా కల్పించే పథకం ఇది. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేయనున్నాయి.

- వేసిన పంటలకు మాత్రమే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు తీసుకోవాలి. ఆ పంట వివరాలు మాత్రమే బ్యాంకులో నమోదు చేయించుకోవాలి.
- ఖరీఫ్, రబీ సీజన్లలో ఈ పథకాన్ని అనుసరించి బీమా ఉన్న పంటలను మాత్రమే సాగు చేసుకోవాలి.
- పంట రుణాలు పొందిన రైతులు బీమా ప్రీమియం నిర్ణీత గడువులోపే సంబంధిత బీమా కంపెనీకి బ్యాంకు ద్వారా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. రుణాలు పొందని రైతులు ప్రీమియంను డీడీ తీసి మండల వ్యవసాయాధికారి ద్వారా సంబంధిత కంపెనీకి పంపాల్సి ఉంటుంది.
- వాతావరణం వల్ల కలిగే దిగుబడి నష్టాలను పంట కోత ఫలితాల ద్వారా వచ్చే దిగుబడి ఆధారంగా నష్టపరిహారం చెల్లిస్తారు.
- రైతులు ప్రతికూల వాతావరణం కారణంగా విత్తలేకపోవడం, నాట్లు వేయలేకపోవడం వల్ల కలిగే ఆర్థిక నష్టాలకు బీమా మొత్తంలో 25శాతం వరకు సత్వర నష్టపరిహారం చెల్లిస్తారు.
- పంట మధ్య కాలంలో నష్టపోయిన పక్షంలో అంచనా వేసిన పరిహారంలో 25శాతం రైతుకు ముందస్తుగా పరిహారం చెల్లించడానికి అవకాశం ఉంటుంది. పంటల కోతల తరువాత పొలంలో ఆరబెట్టిన పంటకు 14 రోజుల వరకు తుపాను, వర్షాలు పంటకు నష్టం జరిగినప్పుడు రైతు వారీ నష్ట పరిహారం అంచనా వేసి చెల్లిస్తారు.
- ఖరీఫ్‌లో ఎక్కువగా పత్తి, వరి, మొక్కజొన్న, కంది, పెసర పంటలు నష్టపోతున్నారు. బీమా పథకం ద్వారా రైతులు పరిహారం పొందవచ్చు.

## వసూళ్లపై చర్యలకు ఆదేశాలు

- టౌన్‌ప్లానింగ్‌పై ఉన్నతాధికారుల దృష్టి
- ఇతర విభాగానికి ఇద్దరు బదిలీ

సాక్షి ఎఫెక్ట్..

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** మంచిర్యాల మున్సిపాలిటీలో ఇళ్ల నిర్మాణాలకు కొందరు అధికారులు అక్రమంగా వసూళ్లు చేస్తున్న తీరుపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. భవన నిర్మాణాల అనుమతికి డబ్బులు వసూలు చేస్తుండడంపై గత నెల 29న ''గూడు'కట్టిన అవినీతి' శీర్షికన కథనం ప్రచురితం కాగా రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్ కే.నారాయణరావు స్పందించారు. 24గంటల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు అటెండర్లకు మొదట షోకాజ్ నోటీసులు ఇచ్చారు. తర్వాత వేరే విభాగానికి బదిలీ చేశారు. కింది స్థాయిలో సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్న అధికారులు, టౌన్ ప్లానింగ్‌లో పని చేస్తున్న పెద్ద తలకాయలను ఎన్ని ఆరోపణలు వస్తున్నా వదిలి వేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగాల్లో భవన నిర్మాణ సమయంలో ప్రజల నుంచి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారు. దీనిపై అటు పాలకవర్గాలతోపాటు అధికార యంత్రాంగానికి తెలిసి కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**ప్రక్షాళన చేస్తేనే..**
పట్టణ ప్రణాళిక విభాగాల్లో గూడు కట్టుకున్న అవినీతిని అరికట్టాలంటే ప్రణాళిక విభాగం పారదర్శకంగా పని చేసేలా చూడాల్సిన అవసరం ఉంది. అధికార యంత్రాంగంతోపాటు ఆ విభాగం ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు ఆ మేరకు నివాసాలు అందుబాటులోకి రావాల్సి ఉంది. ఇందుకోసం భవన నిర్మాణాలు, అపార్టుమెంట్లు, స్వతంత్ర ఇళ్ల నిర్మాణాలు జరుగుతూనే ఉంటాయి. అనేక మందికి అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఇస్తుంటారు. కొంతమందికి అన్ని రకాల డాక్యుమెంట్లు ఉండడం లేదు. కొందరు మాత్రమే అన్నీ కలిగి ఉంటున్నారు. భవన నిర్మాణ నిబంధనల మేరకు పాటించకపోవడంతోనూ అనుమతుల కోసం అక్రమాలకు పాల్పడుతున్నారు. చాలాచోట్ల భూ డాక్యుమెంట్లు సైతం సరిగా ఉండడం లేదు. దీంతో ఇదే అదునుగా వసూళ్లకు తెగబడుతున్నారు. మంచిర్యాల పట్టణంతోపాటు ఇతర మున్సిపాలిటీల్లో అనుమతుల పేరుతో సాగుతున్న అక్రమ వసూళ్లను ఆపాల్సిందిగా కోరుతున్నారు.

# అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ

- బీజేపీ మొదటి జాబితాలో దక్కని అవకాశం
- పెద్దపల్లి ఎంపీ స్థానానికి వెల్లడికాని వైనం
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఆశావహుల్లో ఎదురుచూపులు



**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను రాజకీయ పార్టీలు ఖరారు చేస్తున్నాయి. బీజేపీ తొలి విడతలో తొమ్మిది అభ్యర్థులను శనివారం ప్రకటించింది. ఇందులో పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థి పేరు ప్రకటించలేదు. ఇదిగో అదిగో అంటూ జాప్యం చేస్తుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. మలి విడత జాబితాలో ఈ స్థానానికి పేరు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీలోనూ తమ అభ్యర్థుల ఎంపిక కసరత్తు దాదాపు తుది దశకు చేరింది. రాష్ట్రంలో తొలి జాబితా విడుదల కాలేదు. పార్టీ వర్గాల చెబుతున్న ప్రకారం తొలి జాబితాలో పెద్దపల్లి సీటుకు అభ్యర్థి పేరు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి తొలి జాబితాలోనే తమ పేరు ఉంటుందని అంతా ఆశించారు. పెద్దపల్లి స్థానాన్ని పెండింగ్‌లో ఉంచడంతో టెన్షన్ కొనసాగుతోంది. ఆశావహులు మాత్రం తమ ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వారితోపాటు టికెట్ దక్కని వారందరూ బరిలో ఉంటామని తమ ఆసక్తి వెల్లడిస్తున్నారు.

**కాంగ్రెస్‌లోనే పోటీ..**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఎంపీ టికెట్ కోసం అనేకమంది పోటీలో ఉన్నారు. సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరి టికెట్ ఆశిస్తున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు వంశీక్రిష్ణ, గోమాసే శ్రీనివాస్, రామిళ్ల రాధిక, పెద్దపల్లి జిల్లా నుంచి పెర్క శ్యామ్‌తోపాటు పలువురు పోటీలో ఉన్నారు. మొత్తంగా 29మంది టికెట్‌కు దరఖాస్తు చేసుకోగా మూడు పేర్లు పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి చేరాయి. దీంతో ఢిల్లీలో ఏఐసీసీ పెద్దల కటాక్షం ఎవరి దక్కుతుందోనని పార్టీ నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. బీజేపీ నుంచి నాయకులు దుర్గం అశోక్, కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులి రాజమల్లుతోపాటు అనేక మంది టికెట్ ఆశిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు, జిల్లా గ్రంథాయాల సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ ఉన్నారు. వీరితోపాటు మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పోటీలో ఉంటారనే పార్టీ వర్గాలు అంటున్నాయి. వీరిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తోపాటు పలువురు పేర్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో అభ్యర్థుల పేర్లు వెల్లడవుతున్న క్రమంలో ప్రజల్లో తమ పట్టు పెంచుకునేందుకు కార్యక్రమాలు చేపడుతున్నారు.

# అమ్మకానికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు!

- బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో వసూళ్ల పర్వం
- రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు..

**బెల్లంపల్లి:** అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం అంగట్లో సరుకుగా మారింది. రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు దండుకుని నియమిస్తుండడం చర్చనీయాంశమైంది. ఎన్నేళ్లు చేసినా శాశ్వతం కాని, ఎగువ శ్రేణి జీతం రాని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో కొందరు వసూళ్లకు తెరతీశారు. బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్వీపర్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ గార్డు, పెస్ట్ కంట్రోల్ పనుల నిర్వహణ కోసం ఓ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ కాంట్రాక్టు దక్కించుకుంది. 25మందికి ఉద్యోగాలు కల్పించే కాంట్రాక్టు వచ్చిందనే సమాచారంతో రాజకీయంగా కొందరు ఏజెన్సీదారునిపై ఒత్తిడి తీసుకొచ్చి నియామకాల్లో వాటా అడిగినట్లు ప్రచారం జరుగుతోంది. గరిష్టంగా 15మందికి తగ్గకుండా తాము సూచించిన వ్యక్తులను నియమించుకోవాలని ఒప్పించినట్లు తెలుస్తోంది. ఏజెన్సీదారుడు అంగీకరించడంతో కొందరు వసూళ్ల పర్వానికి తెరతీశారు. ఓ రాజకీయ పార్టీకి చెందిన కొందరు ఏజెన్సీదారుడికి నియామకాల కోసం కొందరిని సిఫారసు చేశారు. వీరిలో ఒకే పేరు కలిగిన ఇద్దరు నాయకులు నిజాయతీగా వ్యవహరించగా.. మరికొందరు డబ్బులు తీసుకుని సిఫారసు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కో వ్యక్తి వద్ద రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. కొందరు ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకులు సైతం ఈ దందాలో భాగస్వామ్యమైనట్లు తెలుస్తోంది. ఏజెన్సీ నిర్వాహకుడితో కుమ్మక్కై మరికొందరికి ఉద్యోగావకాశం కల్పించినట్లు ప్రచారంలో ఉంది. వీరు కూడా ఒక్కొక్కరి వద్ద రూ.లక్షలు వసూలు చేసినట్లుగా ఆస్పత్రి వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**పర్మనెంటు చేయిస్తామని..**
ప్రస్తుత ఉద్యోగం కొన్నాళ్ల తర్వాత పర్మనెంట్ అవుతుందని నమ్మబలికినట్లు తెలుస్తోంది. ఆ మాటలకు ఆకర్శితులై సదరు నిరుద్యోగులు లక్షలు సమర్పించినట్లు సమాచారం. ఓ చోటా నాయకుడు లేనిపోని డాంభికాలు ప్రదర్శించి ఎందరి వద్దనో అందిన కాడికి దండుకుని జేబులు నింపుకున్నాడనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీ కాల పరిమితి రెండేళ్లపాటు ఉంటుంది. అప్పటి పరిస్థితులను బట్టి మరో ఏడాది పాటు నిర్వహణకు అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని దాచిపెట్టి పర్మనెంట్ చేయిస్తామని చెప్పి నిరుద్యోగులను నిండా ముంచారని తెలుస్తోంది.

# ఎన్నికల్లో ప్రశాంతతకు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

**మంచిర్యాలఅగ్రికల్చర్:** పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంటు ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మంచిర్యాల జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సహాయ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,500 మంది ఓటర్లుగా ఉండే పరిమితిని 1,600 మందికి పెంచామని తెలిపారు. జిల్లాకు సంబంధించి ఓటరు జాబితాలో 583 డూప్లికేట్ ఎపిక్ కార్డులను తొలగించామని, పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### నవభారత్ సాక్షరతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**మంచిర్యాలఅగ్రికల్చర్:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవభారత్ సాక్షరతా కార్యక్రమాన్ని జిల్లాలో అధికారులు విజయవంతం చేయాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరక్షరాస్యులను దశలవారీగా అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో నవభారత్ సాక్షరతా కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. స్వచ్ఛంద సేవకు ముందుకు వచ్చే వాలంటీర్ల ద్వారా నిర్వహిస్తారని, ఓఎల్‌టీఎస్(ఓల్లాస్) అనే డిజిటల్ యాప్ ద్వారా సేవ అందించే వాలంటీర్, తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతీ అక్షరాస్యుడు కనీసం ముగ్గురు, నలుగురు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడాన్ని బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో మెంబర్ కన్వీనర్‌గా, వయోజన విద్య ఉప సంచాలకులు లైజన్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో గణపతి, డీఈవో ఎస్.యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, సంక్షేమ అధికారి కె.చిన్నయ్య, మైనార్టీ, సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి వినోద్‌కుమార్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం, జిల్లా వయోజన విద్య అధికారి, లైజన్ అధికారి పురుషోత్తం పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలు ఉండకూడదు

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- అర్హులకే గృహజ్యోతి అందాలి
- సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



నస్పూర్‌లో జీరో బిల్లు అందజేస్తున్న సీఅండ్‌ఎండీ

**మంచిర్యాలఅగ్రికల్చర్:** జిల్లాలో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, అంతరాయం, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎన్పీడీసీఎల్ సీఅండ్‌ఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నస్పూర్ మండలంలో గృహజ్యోతి జీరో విద్యుత్ బిల్లులు, జిల్లా కేంద్రంలో పాత మంచిర్యాలలోని విద్యుత్ పరికరాల స్టోర్‌ను పరిశీలించారు. అనంతరం ఎస్‌ఈ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి అర్హులైన గృహ వినియోగ లబ్ధిదారులకే అందాలని, దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. మరమ్మతులు, కొత్త పరికరాలు అమర్చడానికి స్టోర్‌లో ఆలస్యం చేయకుండా సత్వరమే పరికరాలు అందించాలని తెలిపారు. వినియోగానికి తగ్గట్టుగా పెండింగ్ బకాయిలు వసూలు చేయాలని తెలిపారు. కార్పొరేషన్ డీఈ అనిల్‌కుమార్, ఎస్‌ఈ శేషారావు, డీఈ ఖైసర్, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

### గృహజ్యోతి జీరో బిల్లు అందజేత

**నస్పూర్:** పట్టణ పరిధిలోని గృహజ్యోతి పథకంలో అర్హులైన లబ్ధిదారులకు ఎన్పీడీసీఎల్ సీఅండ్‌ఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి జీరో బిల్లులు అందజేశారు. శనివారం పట్టణంలోని ఫ్లడ్‌కాలనీలో ఆయన పర్యటించి గృహజ్యోతి పథకం అమలు తీరును పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. గృహజ్యోతి పథకంలో అర్హులైన పలువురికి జీరో బిల్లులు అందజేశారు. గృహాలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడకందారులు అందరూ ఈ పథకానికి అర్హులేనని, ఎవరైనా అర్హులు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో అన్ని ధ్రువపత్రాలు అందజేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ శేషారావు, ఎస్ఏఓ శ్రీనివాస్, ఏడీఈలు రేగుంట స్వామి, రాజశేఖర్, ఏఈ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బైక్ చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ కొంతం తిరుపతిరెడ్డికి చెందిన బైక్ శనివారం చోరీకి గురైంది. ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు బైక్ చోరీకి గురైన పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించారు. కాగా పోలీసులు కేసు నమోదు చేయక పోవడం గమనార్హం.

### చికిత్స పొందుతూ యువతి మృతి



నవనీత(ఫైల్)

బెజ్జూర్: గతనెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. మండలంలోని ఇందిర్‌గాం గ్రామానికి చెందిన కావుడె నవనీత (19) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఫిబ్రవరి 21న పురుగుల మందుతాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు బెజ్జూర్ పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యంకోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స అందించగా గురువారం ఇంటికి తీసుకు వచ్చారు. శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మృతి చెందింది. మృతురాలి తండ్రి దేవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



ప్రమాదంలో కాలిపోయిన పత్తి

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని జీవీపీ ఆగ్రో జిన్నింగ్ మిల్లులో శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మిల్లులో పత్తి జిన్నింగ్ చేస్తున్న క్రమంలో నిప్పు రవ్వలు పత్తిపై పడటంతో ప్రమాదం జరిగింది. వెంటనే అక్కడ పని చేస్తున్న సిబ్బంది అగ్ని మాపక అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తం అయిన సిబ్బంది మంటలు చెలరేగకుండా చర్యలు తీసుకోవడంతో ఎక్కువగా నష్టం వాటిల్లలేదని మిల్లు యాజమాని గాదె అవినాష్ తెలిపారు. సంఘటన స్థలాన్ని సీసీఐ అధికారులు, ఎస్సై సాగర్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

### సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ శశిధర్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి చెందిన ఎస్కే అభిహైమద్ మూడు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. మందమర్రి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ యాప్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. శనివారం బాధితుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సీఐ శశిధర్, ఎస్సై రాజశేఖర్ సెల్‌ఫోన్ అప్పగించారు.

# ప్లాంటు మూత.. బకాయిలు రాక..

- ఆందోళనలో 'శాలివాహన' కార్మికులు
- 15 నెలలుగా బకాయిల కోసం ఎదురుచూపు
- 32 రోజులుగా నిరాహారదీక్ష



నిరాహారదీక్ష చేస్తున్న శాలివాహన పవర్‌ప్లాంట్ కార్మికులు

పాతమంచిర్యాల: తమకు రావాల్సిన 15 నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంట్ కార్మికులు 32 రోజులుగా నిరాహారదీక్ష చేపడుతున్నారు. 2002లో పాతమంచిర్యాల శివారులోని రంగపేటలోని 40 ఎకరాల స్థలంలో గ్రీన్ ఎనర్జీ బయోమాస్ పవర్ ప్లాంట్ పేరుతో హైదరాబాద్‌కు చెందిన మల్క కొమురయ్య పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. 2002 డిసెంబర్ 6న విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. కంపెనీలో రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు కలిపి సుమారుగా 400 మంది కార్మికులు ఉపాధి పొందేవారు. ఆ సమయంలో ప్లాంట్‌లో 100 మంది కార్మికులు కేవలం రోజుకు 60 రూపాయల వేతనంతో పని చేసేవారు. 2022 నాటికి కార్మికుల వేతనం రూ.20 వేలకు చేరింది. కంపెనీ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ ఇరవై సంవత్సరాలు. 2022 లో అగ్రిమెంట్ రెన్యూవల్ కాకపోవడంతో డిసెంబర్ 6న కంపెనీ యాజమాన్యం పవర్ ప్లాంట్‌ను మూసివేసింది. కానీ కార్మికులకు రావాల్సిన కంపెనీ క్లోజింగ్ బెనిఫిట్స్, వేతనాలు చెల్లించకుండా 15 నెలలుగా యాజమాన్యం కాలయాపన చేస్తోంది. తమ బకాయిలు చెల్లించాలని కార్మికశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేసినా యాజమాన్యంలో చలనంరావడంలేదని కార్మికులు వాపోతున్నారు.

**నష్టాల పేరుతో కంపెనీ మూత**

నష్టాల పేరుతో కంపెనీ మూసివేయాల్సి వచ్చిందని యాజమాన్యం కట్టుకథలు చెబుతోందని కార్మికులు పేర్కొంటున్నారు. గడువుతీరిన విత్తనాలకు, వాడేసిన కొబ్బరిబోండాలకు ఎలాంటి ఖరీదు లేదని వరిఊకకు మాత్రం డిమాండ్‌ను బట్టి ఖరీదు చెల్లించేవారని కార్మికులు పేర్కొంటున్నారు. కంపెనీ వ్యర్థాలుగా వచ్చిన బూడిదను టన్నుకు రూ.2వేల చొప్పున ఇటుక బట్టీలకు అమ్ముకునేవారన్నారు. ప్లాంట్ ఏర్పాటు సమయంలో కంపెనీలో శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని చెప్పి అక్కడి రైతుల నుంచి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలకు పంట భూములు కొనుగోలు చేసిందని, ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎకరాకు రూ.4 కోట్లు పలుకుతుండడంతో సదరు కంపెనీ యాజమాన్యం అట్టి భూముల్ని అమ్ముకుని కార్మికులకు ఎంతోకొంత ముట్టజెప్పి వదిలించుకోవాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కంపెనీ లాకౌట్ ప్రకటిస్తున్నామని వందరోజులు ముందుగానే ప్రభుత్వానికి, కార్మికులకు నోటీసుల ద్వారా తెలపాల్సి ఉంది. కానీ అవేం చేయకుండా పవర్‌పర్చేజ్ అగ్రిమెంట్ రావడం లేదని అబద్ధాలు చెప్తూ కాలం గడిపారన్నారు. ప్లాంట్ నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి సబ్సిడీలు పొంది చవకగా వచ్చిన భూములను అధికధరలకు అమ్ముకుందామనే దురాలోచనతోనే ఉన్నారని ఆరోపిస్తున్నారు. తమకు రావాల్సిన వేతనాలు, బకాయిలను చెల్లించేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

### ఉద్యమాన్ని కొనసాగిస్తాం



మాకు భవిష్యత్ ఉంటుందనే నమ్మకంతో ఇరవై ఏళ్లుగా తక్కువ వేతనానికి పనిచేశాం. అర్థాంతరంగా ప్లాంట్ మూసివేతకు యాజమాన్యం నిర్ణయం తీసుకోవడంతో కార్మికులు రోడ్డున పడ్డారు. వారికి రావాల్సిన బకాయిలు వచ్చేంత వరకు కొట్లాడుతాం. డైరెక్టర్ల ఇళ్లను ముట్టడిస్తాం.

– కుంటాల శంకర్, పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు

### ఉద్యోగాలు వస్తాయని..



మాకు కంపెనీలో ఉద్యోగాలు వస్తాయనే ఆశతోనే విలువైన భూములను తక్కువ ధరకు ప్లాంట్ నిర్మాణం కోసం అప్పగించాం. ఇప్పుడు అర్థాంతరంగా కంపెనీ మూసివేసి మాకు ఎలాంటి ఉపాధి లేకుండా చేశారు. మా భూములు మాకు అప్పగిస్తే వ్యవసాయం చేసుకునైనా బతుకుతం.

– నిమ్మరాజుల సత్యనారాయణ, పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

### ఈజ్‌గాం ఠాణా ఎదుట ధర్నా

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని మండువ గ్రామానికి చెందిన కమ్మరి రోజా రెండురోజుల క్రితం అనుమానాస్పదంగా మృతి చెందగా, ఆమె కుటుంబసభ్యులు శనివారం ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ స్టేట్ కన్వీనర్ శైలజాగౌడ్ మాట్లాడుతూ రోజా మరణానికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడు స్థానిక ప్రజాప్రతినిధి బంధువు కావడంతోనే కేసు తప్పుదోవ పట్టించి అతడిని కాపాడేయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లకు గురై కేసును నీరుగారిస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కేసు విచారణ కొనసాగుతున్నట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు.

### రెండు నెలలుగా ఒకటో తేదీనే జీతాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పొందు పరచిన విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు రెండు నెలలుగా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తోందని టీఎన్జీవో అటవీశాఖ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పొన్న మల్లయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2019 అక్టోబర్ 1న జీతాలు అందుకున్న ప్రభుత్వ ఉద్యోగులు ఇన్నాళ్లకు మార్చి 1వ తేదీతో రెండు నెలలుగా జీతాలు అందుకుంటున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, 317 జీవో బాధితుల సమస్యలను పార్లమెంట్ ఎన్నికలకు ముందే పరిష్కారం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

## రికార్డులు కొనసాగించాలి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఉత్పత్తి లక్ష్య సాధనలో ఆర్కే 6 గని రికార్డులను నమోదు చేసుకుంటుందని, దీనిని ఇలాగే కొనసాగించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. ఈ ఏడాది వార్షిక లక్ష్యాన్ని ఆర్కే 6 గని 30 రోజుల ముందుగానే సాధించింది. ఈ సందర్భంగా శనివారం గనిపై ఏర్పాటు చేసిన అభినందన సభకు జీఎం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఫిబ్రవరి 29 నాటికే 1,80,000 టన్నుల వార్షిక లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమన్నారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ ఈ.తిరుపతి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు బాజీసైదా, ముస్కె సమ్మయ్య, సంఘం సదానందం పాల్గొన్నారు.

## కార్మికులు రక్షణతో పనిచేయాలి



భవనాన్ని ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తి, రవాణాలో కార్మికులు రక్షణతో పని చేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని సీహెచ్‌పీ వద్ద రూ.50 లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులకు పాలనాపరమైన సౌలభ్యం కోసం ఈ భవనం నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, గని మేనేజర్ సుధీర్, సంక్షేమాధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్‌వోటూ జీఎంగా పురుషోత్తంరెడ్డి**

శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటూ జీఎంగా పురుషోత్తంరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారిగా ఉన్న ఆయన ఇటీవల ఇక్కడికి బదిలీ అయ్యారు.

## 'జయంతి వేడుకలు దురదృష్టకరం'

శ్రీరాంపూర్: మాజీ స్పీకర్, దివంగత నేత శ్రీపాదరావు జయంతి వేడుకలను సింగరేణి యాజమాన్యం నిర్వహించడం దురదృష్టకరమని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు ఎస్కే బాజీసైదా, డెప్యూటీ జనరల్ సెక్రెటరీలు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీపాదరావుకు సింగరేణికి ఎలాంటి సంబంధం లేదన్నారు. సింగరేణిలో ఎప్పుడు లేని సంప్రదాయాలను నేడు మొదలు పెట్టారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కంటే నేడు కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. సింగరేణి యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలను రద్దు చేయాలన్నారు.

### కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలోని దంతన్‌పల్లి సెక్షన్‌లో శనివారం అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు అటవీశాఖ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కౌడన్ మొవాడ్ నుండి ఆసిఫాబాద్ వైపు వస్తున్న టాటా ఇండికా కారులో అక్రమంగా కలప తరలిస్తుండగా డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌కుమార్ తన టీంతో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. తనిఖీల్లో 11 కలప దుంగలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కలప విలువ సుమారు రూ.67వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో మురళీగూడ సెక్షన్ అధికారి మహేందర్, బీట్ అధికారులు రాజేశ్, అనీల్, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళలకు క్రీడా పోటీలు

శ్రీరాంపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న సాయంత్రం 5 గంటలకు నస్పూర్ కాలనీలోని సేవా భవన్ వద్ద బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్, సాయంత్రం బంగ్లా ఏరియాలోని ఇల్లందు క్లబ్ వద్ద బాల్ ఇన్ బాస్కెట్, పాసింగ్ బాల్, బాంబ్ బ్లాస్ట్ పోటీలు, 5న సాయంత్రం 5 గంటలకు శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి మైదానంలో బాంబ్ బ్లాస్ట్ పోటీలు, 6న సాయంత్రం 4 గంటలకు జీఎం కార్యాలయంలో ఇవే పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### 'పెద్దపల్లి సీటు నేతకానీలకు ఇవ్వాలి'



మాట్లాడుతున్న ఏమాజీ

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ సీటును నేతకాని సామాజిక వర్గానికి కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ ఆ పార్టీ అధిష్టానాన్ని కోరారు. శనివారం ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఈసారి తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నేతకాని కులస్తుడైన తనకు సీటు కేటాయిస్తే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

### పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

మంచిర్యాలఅగ్రికల్చర్: 2024–25 విద్యాసంవత్సరానికి గానూ హైదరాబాద్‌లోని బేగంపేట్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్ (ఇంగ్లిష్ మీడియం)లో 1వ తరగతిలో ప్రవేశంకోసం నిరుపేద గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోండు, నాయక్‌పోడ్, కొలాం–పీటీజీ, కోయ, సుగాలీ, లంబాడా, ఇతర గిరిజన విద్యార్థుల్లో ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలను లక్కీడిప్ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు మించి ఉండరాదన్నారు. అభ్యర్థులు జూన్ 1, 2017 నుంచి మే 31, 2018 మధ్య జన్మించి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 11న సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో ధ్రువీకరణపత్రాలు అందజేయాలన్నారు.

## శ్రీరాంపూర్‌లో 107 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్ గనులు ఫిబ్రవరి మాసంలో 107 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో 5.25 లక్షల టన్నులు నిర్దేశించగా 5.62 లక్షల టన్నులు సాధించామన్నారు. ఏప్రిల్ 1, 2023 నుంచి ఇప్పటి వరకే నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 60.22 లక్షల టన్నులకు గానూ 52.22 లక్షల టన్నులు సాధించామన్నారు. దీంతో 86 శాతం ఉత్పత్తి నమోదైందన్నారు. అన్ని గనుల్లో కెల్లా ఆర్కే 6 గని బొగ్గు ఉత్పత్తిలో ముందుందన్నారు. 30 రోజులు ముందే వార్షిక లక్ష్యాన్ని సాధించారన్నారు. కంపెనీ ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దీన్ని సాధించాలంటే రోజువారీగా 2.27 లక్షల టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..



ట్రాక్టర్‌తో కూల్చివేస్తున్న ఇంటి పునాది

బెల్లంపల్లి: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేయించారు. భూకబ్జాలు శీర్షికన శనివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్డీవో హరికృష్ణ అక్రమ నిర్మాణాల కూల్చివేతకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు రడగంబాల బస్తీకి వెళ్లి సర్వేనంబర్ 170లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్ల పునాదులు, గుడిసెల ను ట్రాక్టర్‌తో కూల్చివేయించారు. ఈ క్రమంలో కొందరు అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులు నిలువరించారు.

**ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకుంటాం**

బెల్లంపల్లిలో జరుగుతున్న ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకుంటామని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రత్యేకంగా రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులతో రెండు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. రెండు, మూడు రోజుల వ్యవధిలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయో గుర్తించి నిర్మాణాలను కూల్చివేయిస్తామన్నారు. అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి ముఖేష్

భీమిని(బెల్లంపల్లి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ముఖేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి సమస్య ఉన్నా మండల లీగల్ కౌన్సిలింగ్ అథారిటీ, బెల్లంపల్లి కోర్టుకు పోస్టుకార్డు ద్వారా ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ భీకరణదాస్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్, సీనియర్ న్యాయవాదులు గోపికిషన్ సింగ్, అశోక్, ఎస్సై ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

**మెనూ ప్రకారం భోజనం అందించాలి**

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని న్యాయమూర్తి ముఖేష్ అన్నారు. కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులు చూపించాలని ప్రత్యేకాధికారి కవితను అడగగా పాఠశాలలో లేవని చెప్పడంతో ఆశ్చర్యానికి గురై వెంటనే తెప్పించాలని ఆదేశించారు.

### 'ప్రధాని మోదీ సభ విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న వెరబెల్లి రఘునాథ్

మంచిర్యాలక్రైం: ఈ నెల 4న ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కొప్పు బాష, పార్లమెంట్ కో కన్వీనర్, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, ఆదిలాబాద్ మాజీ జెడ్పీచైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, పాల్గొన్నారు.

### 11న మత్స్యకారుల సహకార సంఘం ఎన్నికలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 11న జిల్లా మత్స్యకారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి, ఎన్నికల అధికారి జె.నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నామనేషన్ల స్వీకరణ, 1:30 నుంచి 3 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, 3:30 నుంచి 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 11న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీలో గల ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు.

### 'ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

కాసిపేట: కాసిపేట 2గని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ డిమాండ్ చేశారు. శనివారం గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. మోటర్ సైకిల్ షెడ్డు నిర్మించాలని, క్వార్టరు లేనివారికి ఇంటి కిరాయి చెల్లించాలని, ఎలక్ట్రీషియన్, పిట్టర్‌లకు హెల్పర్లను ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి లాకర్ కేటాయించాలని కోరారు. గని పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, బ్రాంచ్ ఆఫీస్ బేరర్ సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

### జాతర ఏర్పాట్లు పరిశీలన

బెల్లంపల్లిరూరల్: కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ శనివారం పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో బాపురెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతి

వాంకిడి(ఆసిఫాబాద్): విద్యుత్ షాక్‌తో బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన చౌదరి సరిత, సోమయ్య దంపతుల కుమారుడు రిషికుమార్ (4) శనివారం మధ్యాహ్నం అతని తల్లి ఇంట్లోనే బోరువద్ద బట్టలు ఉతుకుతుండగా అక్కడే ఆడుకుంటున్నాడు. బోరుకు ఉన్న ఇనుపరాడ్‌ను పట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన బాలుడి తల్లి వెంటనే బోరు మోటార్ ఆపేయడంతో బాలుడు ఎగిరిపడి స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆసిఫాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి తల్లి సరిత ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

**నిర్లక్ష్యమే కారణమా?**

బోరు వద్ద గతంలోనూ చిన్నపాటి విద్యుత్‌షాక్ తగిలిన సంఘటనలు చోటు చేసుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. బోర్ మోటార్‌కు రిపేర్ చేయించడంతో చేసిన జాప్యానికి బాలుడు బలి అయినట్లు తెలుస్తోంది.

### కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న తిలక్

చెన్నూర్: కత్తితో పొడుచుకుని యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ తెలిపిన వివరాల మేరకు కోటపల్లి మండలం శంకర్‌పూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తాండ్ర తిలక్ (27) శనివారం సాయంత్రం చెరువుకట్ట ప్రాంతంలో ఆటో నిలిపి కడుపులో కత్తితో పొడుచుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో 108లో ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం మంచిర్యాలకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా సదరు యువకుడి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియలేదని, ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

### ఎలక్ట్రికల్ షాపులో అగ్నిప్రమాదం

నస్పూర్: పట్టణ పరిధిలోని రాజ ఎలక్ట్రికల్ షాపులో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దుకాణంలోంచి దట్టమైన మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేప్రయత్నం చేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ల వేణు, కౌన్సిలర్ బేర సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మంటలకు గల కారణాలు తెలియరాలేదు. అగ్ని ప్రమాదంలో ఎంతనష్టం జరిగిందనేది అంచనా వేయలేక పోతున్నామని, మంటలు పూర్తి స్థాయిలో అదుపులోకి వస్తేనే అంచనా వేయగలమని ఫైర్ అధికారి దేవేందర్ తెలిపారు.